సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



క్రమబద్ధీకరణకు దరఖాస్తు

ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని జేసీ విశ్వనాథన్ సూచించారు. 8లో



పరిశ్రమలు స్థాపించండి

ఔత్సాహికులకు ఎక్స్‌పోలు ఉపయుక్తంగా నిలుస్తాయని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్.గణపతి అన్నారు. 8లో



వస్త్ర దుకాణం దగ్ధం

గోపాలపట్నం యువరాణి వస్త్ర దుకాణంలో గురువారం రాత్రి 11.15 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. 8లో

న్యూస్‌రీల్

విశాఖ పోర్టులో రికార్డు స్థాయి లోడింగ్

44.37 వేల మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ పెల్లెట్స్ హ్యాండ్లింగ్



పోర్టులో లోడింగ్ జరుగుతున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం : మరో అరుదైన రికార్డును విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) తన ఖాతాలో వేసుకుంది. పోర్టు చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా ఐరెన్ ఓర్ పెల్లెట్స్ లోడింగ్ చేస్తూ రికార్డు సృష్టించింది. 44,374 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ పెల్లెట్స్‌ని గురువారం ఏకకాలంలో పార్సిల్ లోడింగ్ చేసినట్లు పోర్టు అధికారులు ప్రకటించారు. గతంలో 35,100 మెట్రిక్ టన్నుల లోడింగ్ మాత్రమే ఇప్పటివరకు రికార్డుగా ఉండేది. ఆ రికార్డుని అధిగమిస్తూ జల్ కల్పతరు కార్గో షిప్‌లో రికార్డు స్థాయిలో లోడ్ చేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు.

30న పనిచేయాల్సిందే..

విశాఖ విద్య : జిల్లాలోని అన్ని పాఠశాలలు ఈ నెల 30న పనిచేయాల్సిందేనని డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో చివరి పనిదినంగా ఈ నెల 30గా పరిగణించాలన్నారు. మే 1 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయన్నారు. తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభమవుతాయన్నారు.

ప్రతి నెలా 1, 15 తేదీల్లో డయల్ యువర్ సీపీ

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించేందుకు నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ శ్రీకారం చుడుతున్నారు. ఇందుకోసం ప్రతి నెలా 1వ తేదీ, అలాగే 15వ తేదీలలో డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను 0891–2523408 నెంబర్‌కు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య కాల్ చేసి నేరుగా తెలియజేసే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఏదైనా నెలలో ఆ రోజుల్లో సెలవు వస్తే ఆ మరుసటి రోజు ఈ అదే సమయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఏయూలో జాబ్‌మేళా రేపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ బ్యూరోలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆచార్య పి.అర్జున్ తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థలో ట్రైనీ కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూనియర్ కెమిస్ట్‌కి నెలకు రూ.19,474, సీనియర్ కెమిస్ట్‌కి ఏడాదికి రూ.3.5 లక్షలు వార్షిక వేతనంగా అందిస్తారన్నారు. 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే అపోలో ఫార్మసిస్టులుగా 40 మందిని నియమిస్తుందని, బీఫార్మసీ చేసిన వారు అర్హులని తెలిపారు. రిటైల్ ట్రైనీ అసోసియేట్‌గా 20 ఖాళీలు భర్తీ చేస్తారని చెప్పారు. పదో తరగతి అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన అర్హులన్నారు. ఎన్‌డీటీ అసిస్టెంట్ ఉద్యోగాలకు పదో తరగతి, అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 96660 92491, 83670 48979 నంబర్లలో సంప్రదించాలన్నారు.

30న జోడుగుళ్లపాలెం బీచ్ క్లీనింగ్

ఆరిలోవ: జోడుగుళ్లపాలెంలో ఈ నెల 30న బీచ్ క్లీనింగ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నెలలో ఓ ఆదివారం నగరంలో సాగర తీరం స్వచ్ఛత కార్యక్రమం చేపడుతున్నామని, ఇంతవరకు 10 విడతల బీచ్ క్లీనింగ్ జరిగిందన్నారు. ఈ నెల 30న ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు జోడుగుళ్లపాలెంలో జరిగే బీచ్ క్లీనింగ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు https://swatchvizag.in// వెబ్‌పోర్టల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

నేడు ఎఫ్‌ఏపీసీసీఐ అవార్డుల ప్రదానోత్సవం

మహారాణిపేట: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం నగరంలో జరిగే ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్(ఎఫ్‌ఏపీసీసీఐ) అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. నోవాటెల్‌లో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది.

అరకు కాఫీ అవుట్‌లెట్స్!



- రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- అవుట్‌లెట్స్‌లో అందుబాటులో ఇన్‌స్టెంట్, ఫిల్టర్ కాఫీలు
- తొలివిడతగా విశాఖ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు



సాక్షి, విశాఖపట్నం : సేంద్రియ పద్ధతుల్లో తయారయ్యే అరకు కాఫీ అంటే తెలియనివారంటూ ఎవరూ ఉండరు. ఏజెన్సీలోని వాతావరణమే అరకు కాఫీ రుచికి ప్రధాన కారణమన్నది మెటరాలజీ విభాగ నిపుణులు తేల్చిచెప్పారు. ఇక్కడ పండే అరబికా రకం కాఫీ.. పారిస్, జపాన్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్ దేశాల్లోని నగరాల ప్రజలూ దీని రుచికి సలాం కొట్టారు అందుకే.. 2018లోనే బ్రెజిల్, సుమత్రా, కొలంబోతో పాటు ఇతర దేశాల్ని వెనక్కు నెట్టేసి.. ప్రిక్స్ ఎపిక్యూర్–2018 పోటీల్లో అరకు కాఫీ బంగారు పతకాన్ని సాధించింది. ఇప్పుడు అరకు కాఫీ అవుట్‌లెట్స్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో ప్రారంభించాలని జీసీసీ భావిస్తోంది.

అన్ని కాఫీలకు దీటుగా..

ప్రస్తుతం కాఫీ అవుట్‌లెట్స్ నగరాల్లో పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి. కుంభకోణం, మద్రాస్ ఫిల్టర్ కాఫీ, కోయంబత్తూర్.. ఇలా విభిన్నమైన కాఫీ అవుట్‌లెట్స్ కనిపిస్తున్నాయి. వాటికి కాఫీ ప్రియుల నుంచి ఆదరణ విపరీతంగా ఉంటోంది. వాటన్నింటి కంటే అద్భుతమైన రుచి ఉన్న అరకు కాఫీని కూడా అదే మాదిరిగా ప్రజలు ఆస్వాదించాలనే ఉద్దేశంతో అవుట్‌లెట్స్‌ని ఏర్పాటు చేయాలని జీసీసీ భావిస్తోంది. అరకు కాఫీ రుచిని అందరికీ అందించనుంది. ఇందుకోసం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మొదటగా అరకు కాఫీ అవుట్‌లెట్స్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఫిల్టర్ కాఫీ, ఇన్‌స్టెంట్ కాఫీతో పాటు భిన్నమైన కాఫీ రుచుల్ని ఈ అవుట్‌లెట్స్‌లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే జీసీసీ కాఫీ అవుట్‌లెట్‌ని ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అదేమాదిరిగా నగరాల్లోనూ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అవుట్‌లెట్స్‌ని సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం స్థల అన్వేషణ మొదలు పెట్టాలని ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో జీసీసీ అధికారులు చర్చలు జరిపారు.



అరకు కాఫీ అవుట్‌లెట్

గిరిజనులకు అవకాశాలు



అరకు కాఫీ అవుట్‌లెట్స్ ఏర్పాటుపై బోర్డు సమావేశంలో ప్రతిపాదనల్ని తీసుకొచ్చాను. దీనిపై అధికారులు చర్చలు జరిపారు. అనుకూలమైన స్థలాలు దొరికితే ఆ ప్రాంతాల్లో అవుట్‌లెట్స్‌ని తీసుకురానున్నాం. పైలట్ ప్రాజెక్టుగా విశాఖ నగరంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రంలోని ఇతర నగరాలకు విస్తరించనున్నాం. ఈ అవుట్‌లెట్స్‌లో స్వచ్ఛమైన అరకు కాఫీతో పాటు కాఫీ పొడులు, గింజలు కూడా విక్రయించేలా ప్లాన్ చేస్తున్నాం. అవుట్‌లెట్స్ ద్వారా గిరిజన యువతకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

చలివేంద్రాలు సిద్ధం

- 63 గ్రీన్‌షెల్టర్లకు గ్రీన్‌సిగ్నల్
- 23 బస్టాప్‌లకు హంగులు

డాబాగార్డెన్స్: ఎండలు మండుతున్నాయి. దీనికి తోడు ఉక్కపోత, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో నగర ప్రజలు, కార్మికులు, పాదచారులు, వాహనచోదకుల కోసం జీవీఎంసీ చలివేంద్రాలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. జీవీఎంసీ 98 వార్డుల్లో ప్రధాన జంక్షన్లు, ఐ ల్యాండ్లు, జాతీయ రహదారుల వెంబడి వీటిని ఏర్పాటు చేయనుంది. అలాగే 63 గ్రీన్ షెల్టర్లు కూడా ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే జోన్–3, 4, 5ఏ, 6, 7కి సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. జోన్–5బీ, జోన్–8కి సంబంధించి బిడ్డర్లు రాలేదు. ఈ నెల 29న మరోసారి టెండర్లు పిలవనున్నారు.

చలివేంద్రాలు, గ్రీన్‌షెల్టర్లు ఇలా..

జోన్–1 పరిధిలో 10 చలి వేంద్రాలు, 4 గ్రీన్ షెల్టర్లు, జోన్–2 పరిధిలో 13 చలివేంద్రాలు, 7 గ్రీన్ షెల్టర్లు, జోన్–3 పరిధిలో 26 చలివేంద్రాలు, 4 గ్రీన్ షెల్టర్లు, జోన్–4 పరిధిలో 25 చలివేంద్రాలు, 6 గ్రీన్‌షెల్టర్లు, జోన్–5ఏ పరిధిలో 29 చలివేంద్రాలు, 5 గ్రీన్‌షెల్టర్లు, జోన్–5బీ పరిధిలో 13 చలివేంద్రాలు, 3 గ్రీన్‌షెల్టర్లు, జోన్–6 పరిధిలో 31 చలివేంద్రాలు, 16 గ్రీన్‌షెల్టర్లు, జోన్–7 పరిధిలో 12 చలివేంద్రాలు, 12 గ్రీన్‌షెల్టర్లు, జోన్–8 పరిధిలో 18 చలివేంద్రాలు, 6 గ్రీన్‌షెల్టర్లు ఏర్పాటు చేయనున్నారు. రూ.90.30 లక్షల అంచనాతో ప్రణాళికలు రూపొందించారు.

బస్టాప్‌ల ఆధునీకీకరణ

సిటీ పరిధిలో అనేక బస్టాప్‌లున్నాయి. వీటిలో కొన్నింటి పరిస్థితి దయనీయంగా మారింది. వాటి స్థానంలో పీపీ స్ట్రక్చరల్ మాదిరిగా 23 బస్టాప్‌లను



ఆధునికీకరిస్తున్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. జీ–20 సదస్సులో భాగంగా ఏయూ బస్టాప్‌ను సుందరంగా తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే.

177 చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం



నగర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అన్ని జోన్ల పరిధిలో 177 చలివేంద్రాలు, 63 గ్రీన్‌షెల్టర్లు ఏర్పాటు చేయనున్నాం. పలు జోన్లకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. జోన్–1, 2కి సంబంధించి గురువారం టెండర్లు ఓపెన్ చేశాం. జోన్–5బీ, జోన్–8కి సంబంధించి బిడ్డర్లు ఎవరూ రాలేదు. ఈ నెల 29న మరోసారి టెండర్లు పిలవనున్నాం. నగరంలో పలు బస్టాప్‌లను ఆధునికీకరిస్తున్నాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

నేడు జీవీఎంసీ కౌన్సిల్

- 32 అంశాలపై చర్చ
- టేబుల్ అజెండాగా మరికొన్ని అంశాలు వచ్చే అవకాశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 28న కౌన్సిల్ సమావేశం జరగనుంది. సమావేశంలో భాగంగా 32 అంశాలు పొందుపరచగా.. మరికొన్ని టేబుల్ అంశాలు చర్చకు రానున్నాయి. ప్రధానంగా రూ.1.22 కోట్లతో ముడసర్లోవలో గ్యారేజ్ షెడ్, జీ–20 సదస్సులో భాగంగా అభివృద్ధి చేసిన సీతకొండ మలుపు ప్రాంతాన్ని వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా నామకరణం, జోన్–3, 4లో వెండింగ్ జోన్లు గుర్తించి, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తదితర అంశాల ఆమోదంపై సభ్యులు చర్చించనున్నారు. నేషనల్



జీవీఎంసీ కౌన్సిల్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్ ద్వారా ఎంపిక చేసిన 38 మంది సముద్రపు ఈతగాళ్లను జీవీఎంసీలోకి తీసుకునేందుకు మేయర్ మంజూరు చేసిన ముందస్తు అనుమతి, ఎండాడ సర్వే నంబర్ 118/4లో ఎకరా విస్తీర్ణ భూమిని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లన్సీ, హియరింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భూ బదలాయింపుతో పాటు పలు పరిపాలన అంశాలు చర్చకు రానున్నాయి.

కోరమాండల్ సామాజిక సేవలు భేష్

కలెక్టర్ మల్లికార్జున

పెదగంట్యాడ: కోరమాండల్ ఇంటర్నేషనల్ సామాజిక సేవలు భేష్ అని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్సార్ నిధులు రూ.70 లక్షలతో నెల్లిముక్కు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, రూ.23 లక్షలతో దయాల్‌నగర్‌లోని కళాశాల బాలికల వసతి గృహానికి మరమ్మతులు చేపట్టారు. అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకున్న ఈ రెండు హాస్టళ్లను గురువారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తాను కూడా చిన్నతనంలో హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నానని, అప్పుడు ఇటువంటి సదుపాయాలు లేవన్నారు. హాస్టళ్లను ఆధునికంగా తీర్చిదిద్దిన కోరమాండల్ యాజమాన్య ప్రతినిధులను అభినందించారు.



నెల్లిముక్కులో హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు పథకం కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ భవనాన్ని పునర్నిర్మించాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి కోరమాండల్ ప్రతినిధులను కోరారు. అనంతరం విద్యార్థులకు అతిథులు బ్లాంకెట్లు, చాపలు అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రమణమూర్తి, కోరమాండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, సీఎస్సార్ హెడ్ అమృత శ్రీ వాత్సవ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, తహసీల్దార్ రమాదేవి, పల్లా చినతల్లి, హాస్టల్ వార్డెన్లు శ్యామల, అలివేలు మంగ, నాయకులు గొందేశి వెంకటరమణారెడ్డి, పులి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

మహారాణిపేట: జీవీఎంసీ పరిధిలోని 2,3,4 జోన్లలో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నరవ వద్ద పగిలిన గోదావరి ప్రధాన పైపులైన్ మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా అంతరాయం ఏర్పడనుందని, నగర పౌరులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

- జోన్–2 పరిధి మధురవాడ, పీఎం పాలెం, ఆరిలోవ, చిన్నగదిలి, పెద్దగదిలి, విశాలాక్షినగర్
- జోన్–3 పరిధి చినవాల్తేర్, పెదవాల్తేర్, పాండురంగాపురం, రేసపువానిపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాయకనగర్, మంగాపురం కాలనీ, జాలారిపేట, ఆదర్శనగర్, వాసవానిపాలెం, ఎంవీపీ సెక్టార్–1 నుంచి సెక్టార్–12 వరకు, సీతంపేట, అక్కయ్యపాలెం, లలితానగర్, ఎన్జీవోస్ కాలనీ, శ్రీనివాసనగర్, నందగిరినగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, సింహాద్రిపురం, లక్ష్మీనరసింహనగర్, పాత వెంకోజిపాలెం, దుర్గానగర్.
- జోన్–4 పరిధి వెలంపేట, టౌన్‌కొత్తరోడ్డు, రంగిరీజువీధి, మంతావారివీధి, సున్నపువీధి, రెల్లివీధి, జబ్బర్‌తోట, చిలకపేట, అల్లిపురం ప్రధాన రహదారి, నేరెళ్లకోనేరు రోడ్డు, అమ్మవారి వీధి, కుమ్మరి వీధి, కొబ్బరితోట, నేతాజీనగర్, అంబేడ్కర్ కాలనీ, జెండా చెట్టు, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, దండు బజార్, దిబ్బలపాలెం, జాలారిపేట, సాలిపేట, కేజీహెచ్, డాబాగార్డెన్స్, జగదాంబ ఏరియా, నీలమ్మవేపచెట్టు తదితర ప్రాంతాలు.
- జోన్–4 పరిధి రైల్వే న్యూకాలనీ, వేంకటేశ్వరకాలనీ, నరేంద్రనగర్, తాటిచెట్లపాలెం, సింగాలమ్మపురం, సింహగిరి కాలనీ, కైలాసపురం, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కంచరపాలెం, రామ్మూర్తిపంతులు పేట, సుభాష్ నగర్, సిద్ధార్థనగర్, మహారాణివీధి, మర్రిపాలెం, కరాస, గౌరీనగర్, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుంది.

పక్కి దివాకర్‌కు అంతిమ వీడ్కోలు



దివాకర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



దివాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పంచకర్ల, వంశీకృష్ణ, కేకే రాజు తదితరులు

కంచరపాలెం: గుండెపోటుతో మరణించిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్‌కు గురువారం అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు నిర్వహించారు. అభిమాన నేత అంతిమ వీడ్కోలుకు జిల్లా వ్యాప్తంగా అభిమానులు, నాయకులు, బంధువులు, ముఖ్యనేతలు భారీగా తరలివచ్చారు. మర్రిపాలెం పరిధి మళ్ల రామునాయుడు కాలనీలో గురువారం పార్థివదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ శంకర నారాయణ, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, పార్టీ సమన్వయకర్తలు ఆడారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు, కోలా గురువులు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, డిప్యూటీ మేయర్లు, జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కంపా హనోక్, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, సీనియర్ నాయకులు బెహరా భాస్కరరావు, దాడి రత్నాకర్, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, కొండా రాజీవ్‌గాంధీ, కంటి మహంతి అనూష శశిధర్ పట్నాయక్, మంత్రి రాజశేఖర్, పేడాడ రమణకుమారి, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు మంత్రి అమర్‌నాథ్ పరామర్శ

పక్కి దివాకర్ కుటుంబాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం సాయంత్రం పరామర్శించి ఓదార్చారు. దివాకర్ ఆకస్మిక మరణం తనను ఎంతగానో వేదనకు గురి చేసిందని, ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. దివాకర్ కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముందుగా దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పక్కి దివాకర్ మరణం బాధాకరం: ముత్తంశెట్టి

మద్దిలపాలెం: బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ అకాల మరణం బాధాకరమని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దివాకర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచే ప్లాస్టిక్ నిర్మూలిద్దాం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: విద్యార్థి దశ నుంచే ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రతినిధులు, ప్లాస్టిక్ హోల్‌సేల్, రీటైల్ డీలర్స్, నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోస్, సూపర్ మార్కెట్లు తదితర వ్యాపారస్తులతో నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణ చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే జీవీఎంసీ ప్లాస్టిక్ నిషేధంపై అనేక కార్యక్రమాలు చేపట్టిందని, నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణపై ప్రతి ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టి, వాటి నియంత్రణకు కృషి చేయాలన్నారు. సుందర విశాఖ నగరానికి నిత్యం పర్యాటకులు, సందర్శకులు అధికంగా వస్తుంటారని, వారికి మంచి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మనదేనన్నారు. ప్రజా సంఘాలు ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ భూతంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, వారిలో సృజనాత్మకత వెలికి తీయాలన్నారు. నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోస్ సభ్యుల సూచనలు, సలహాలు జీవీఎంసీ తప్పకుండా పాటిస్తుందని కమిషనర్ తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, యూఎన్డీపీ కో ఆర్డినేటర్ ఎస్ఎస్ రాజమణి, శానటరీ సూపర్వైజర్లు, హోటల్, రెస్టారెంట్, కిరాణా వ్యాపారస్తులు పాల్గొన్నారు.

వేలంలో అప్పన్న దేవస్థానానికి రూ.1.22 కోట్లు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం ఇచ్చిన లీజు హక్కుల ద్వారా సంవత్సరానికి రూ.కోటి 22లక్షల 38,183 ఆదాయం చేకూరింది. పలు వ్యాపారాల నిమిత్తం రెండేళ్ల కాలపరిమితి లీజు హక్కులు ఇచ్చేందుకు గురువారం బహిరంగ వేలం, సీల్డు టెండర్లు నిర్వహించారు. తొలుత ఏడాది కాలపరిమితికి హెచ్చుమొత్తానికి పాటని నిర్వహించి రెండో ఏడాది పదిశాతం హెచ్చుమొత్తంతో లీజులు పెంచుతారు. ఈమేరకు ఏడాది కాలపరిమితికిగాను కొండపై భక్తుల సెల్‌ఫోన్స్, కెమెరాలు భద్రపరిచే లీజు రూ.55,09,999లకు, సన్నిధిఫలాలు తీసుకునే లీజు 32లక్షలకు, కొండపైన, కొండదిగువ ఐస్‌క్రీమ్ బండ్ల లీజు రూ. 22,00,900లకు, శ్రీనివాసనగర్‌లోని దేవస్థానం భవనం అద్దె లీజు రూ.1,09,183కు, పైడితల్లి–బంగారమ్మ ఆలయాల్లో సన్నిధిఫలాలు, చీరలు తీసుకునే లీజు రూ.1,80,009కు, వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు విక్రయం లీజు రూ.4 లక్షలకు, గోపాలపట్నంలోని బుధవారం సంతలో ఆశీలు వసూలు లీజు రూ.1.37 లక్షలకు, బుధవారం సంత మినహా మిగతా రోజుల్లో ఆశీల వసూలు లీజ్ రూ.1.30 లక్షలకు, భైరవస్వామి ఆలయం వద్ద ఐస్‌క్రీమ్ విక్రయం చేసుకునే లీజ్ రూ.9,700లకు, సింహగిరిపై మిషన్ల ద్వారా కాఫీ, టీలు విక్రయం లీజ్ నెలకు రూ.30,116 హెచ్చుమొత్తానికి వెళ్లింది. కమిషనర్ ఆమోదం కోసం హెచ్చుమొత్తాల వివరాలను అధికారులు పంపించనున్నారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, సిబ్బంది చక్రవర్తి వేలం నిర్వహించారు.

పోస్టుమార్టం నివేదికలో ఏముంది?

శ్వేత మృతిపై విభిన్న కోణాల్లో దర్యాప్తు



బీచ్‌రోడ్డు: నగరంలో సంచలనం సృష్టించిన వివాహిత శ్వేత(24) మృతి కేసులో మిస్టరీ వీడలేదు. ఆర్.కె.బీచ్‌లో అనుమానాస్పద స్థితిలో మంగళవారం అర్ధరాత్రి ఆమె శవమై కనిపించిన విషయం విదితమే.. కేజీహెచ్ మార్చురీలో గురువారం శ్వేత మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి, ప్రాథమిక నివేదికను పోలీసులకు అందించారు. ప్రాథమికంగా ఆమెది ఆత్మహత్యగా భావించినప్పటికీ.. మృతదేహం ఉన్న స్థితిని బట్టి అనుమానాస్పద మృతిగా కేసు విచారణ చేస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. కాగా.. ఈ కేసులో మరో ఊహించని మలుపు చోటుచేసుకుంది. శ్వేతను ఆమె భర్త మణికంఠ, అత్తమామలు, ఆడపడుచు అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తే, మణికంఠ సోదరి భర్త సత్యం లైంగిక వేధింపులకు గురి చేసినట్లు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆమె తల్లి రమ ఫిర్యాదు చేశారు. ఒకటి రెండు సార్లు శ్వేతను ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మణికంఠ సోదరి భర్తపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. అత్త, ఆడపడుచులపై వరకట్న వేధింపుల కేసు కట్టి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శ్వేత మృతదేహాన్ని ఆమె తల్లి, బంధువులకు అప్పగించగా.. కాన్వెంట్ కూడలి సమీపంలోని చావుల మదుం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

సీసీ పుటేజ్‌లో రికార్డు కాలేదు : ఇంటి నుంచి బయటకు వచ్చిన శ్వేత ఎలా.. ఎటువైపు వెళ్లింది అనేది సీసీ పుటేజ్‌లో కనిపించలేదు. న్యూపోర్టు పోలీసులు గురువారం శ్వేత అత్తమామ ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. అక్కడి సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. అందులో శ్వేత ఆనవాళ్లు కనిపించలేదని సమాచారం. అయితే ఆమె ఉండే వీధి నుంచి సీసీ కెమెరాలు లేని ఇంకో మార్గం కూడా ఉందని, అటువైపు నుంచి వెళ్లి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శ్వేత మృతదేహం లభ్యమైన ప్రాంతంలో కూడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలిసింది. ఈ కేసులో పోస్టుమార్టం నివేదికతో పాటు ఆమె సెల్‌ఫోన్ కీలకంగా మారింది. ప్రస్తుతం ఆమె కాల్‌డేటాను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇలా పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్ల రద్దు, గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : ఆయా సెక్షన్ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమత్తం విశాఖ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్నింటిని గమ్యం కుదిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు

రద్దు చేసిన రైళ్లు

విశాఖ-రాజమండ్రి (07467/07466) పాసింజర్ స్పెషల్ ఈ నెల 30 నుంచి మే 7వ తేదీ వరకు, కాకినాడ-విశాఖ (17267/17267) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి మే 7వ తేదీ వరకు రద్దు చేశారు. విశాఖ-మచిలీపట్నం(17220)) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి మే 7వ తేదీ వరకు, మచిలీపట్నం-విశాఖ (17219)) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి మే 6వ తేదీ వరకు, విశాఖ-సికింద్రాబాద్(12783)) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి మే 7వ తేదీ రద్దు చేశారు. సికింద్రాబాద్-విశాఖ(12784) ఎక్స్‌ప్రెస్ ఈనెల 29వ, మే 6వ తేదీలలో, పూరీ-తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్ మే 5వ తేదీన రద్దు చేశారు. తిరుపతి-పూరీ(17480) ఎక్స్‌ప్రెస్ మే 5, 6వ తేదీలలో, విశాఖ-తిరుపతి(22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ మే 6న, తిరుపతి-విశాఖ (22708)డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ మే 5న రద్దు చేశారు. విశాఖ-విజయవాడ(22701)ఉదయ్ ఎక్స్‌ప్రెస్ మే 6న, విజయవాడ-విశాఖ (22702)ఉదయ్ ఎక్స్‌ప్రెస్ మే 6న, విశాఖ-కాచిగూడ(12861) ఎక్స్‌ప్రెస్ మే 6,7వ తేదీల్లో, కాచిగూడ-విశాఖ(12862) ఎక్స్‌ప్రెస్ మే 5, 6వ తేదీల్లో రద్దు చేశారు. బిలాస్‌పూర్-తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్ మే 6న, విశాఖ-సికింద్రాబాద్(22203) దురంతో ఎక్స్‌ప్రెస్ మే 7, సికింద్రాబాద్-విశాఖ (22204)దురంతో ఎక్స్‌ప్రెస్ మే 6న రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు

గుంటూరు-విశాఖ(17239)సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి మే 7వ తేదీ వరకు సామర్లకోట వరకు మాత్రమే నడుస్తుంది. విశాఖ-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 30 నుంచి మే 7వ తేదీ వరకు విశాఖ నుంచి కాకుండా సామర్లకోట నుంచి బయల్దేరుతుంది. గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి మే 6 వరకు తుని వరకు మాత్రమే నడుస్తుంది. రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి మే 7 వరకు రాయగడ నుంచి కాకుండా తుని నుంచి బయల్దేరుతుంది. విశాఖ-విజయవాడ(12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి మే 7వ తేదీ వరకు విశాఖ నుంచి కాకుండా అనకాపల్లి నుంచి బయల్దేరుతుంది. విజయవాడ-విశాఖ(12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి మే 7వ తేదీ వరకు అనకాపల్లి వరకు మాత్రమే నడుస్తుంది.

పలు రైళ్లు రీ షెడ్యూల్

ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6.25 గంటలకు హతియాలో బయల్దేరాల్సిన హతియా-బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. ఈనెల 30, మే 2వ తేదీల్లో సాయంత్రం 6.25 గంటలకు హతియాలో బయల్దేరాల్సిన హతియా-బెంగళూరు(12835) ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా రాత్రి 10.25 గంటలకు బయల్దేరుతుంది. మే 1వ తేదీ సాయంత్రం 6.25 గంటలకు హతియాలో బయల్దేరాల్సిన హతియా-ఎర్నాకుళం(22837) ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. మే3వ తేదీ మధ్యాహ్నం 1.20గంటలకు జసిద్దిలో బయల్దేరాల్సిన జసిద్ధి-తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. మే 4వ తేదీ సాయంత్రం 6.35 గంటలకు టాటాలో బయల్దేరాల్సిన టాటా-యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. ఈ నెల 30, మే 4వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటలకు ముంబయిలో బయల్దేరాల్సిన ముంబయి సీఎస్‌టీఎం-భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ 3.30 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. ఈ నెల 30, మే 3వ తేదీల్లో తెల్లవారు 5.10గంటలకు నిజాముద్దీన్‌లో బయల్దేరాల్సిన నిజాముద్దీన్-విశాఖ(12804) ఎక్స్‌ప్రెస్ 4.30 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది.

స్పెషల్ రైళ్ల పొడిగింపు

వేసవి సెలవుల నేపథ్యంలో రద్దీ మార్గాలలో పలు ప్రత్యేక రైళ్లను మరింతకాలం పొడిగిస్తున్నటు రైల్వే వర్గాలు తెలిపాయి.

విశాఖ-మహబూబ్‌నగర్(08585)వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతీ మంగళవారాలలో సాయంత్రం 5.35గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.30గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 2 నుంచి జూన్ 27వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో మహబూబ్‌నగర్- విశాఖ (08586) వీక్లీ స్పెషల్ మహబూబ్‌నగర్‌లో ప్రతీ బుధవారాలలో సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.50గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు మే 3వ తేదీ నుంచి జూన్ 28వ తేదీ వరకు పొడిగించారు. విశాఖ-తిరుపతి(08583)వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతీ సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 1నుంచి జూన్ 26వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి-విశాఖ (08584)స్పెషల్ తిరుపతిలో ప్రతీ మంగళవారాల్లో రాత్రి 9.55 గంటలకు బయల్దేరి, మరుసటిరోజు ఉదయం 10.15గంటలకు విశాఖ చేరుకుంటంది. ఈ స్పెషల్ రైలు మే 2వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు పొడిగించారు.

ఇంటర్ విద్యార్థుల బలవన్మరణం


అఖిల శ్రీ(ఫైల్)


జగదీష్ మృతదేహం

మల్కాపురం: ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఇద్దరు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథ్‌పురంలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఆత్మకూరు వెంకటేశ్వరరాజు తన భార్య, కుమార్తె అఖిలశ్రీ(16), 12 ఏళ్ల కుమారుడితో కలిసి కొంత కాలంగా జీవనం సాగిస్తున్నారు. అఖిల శ్రీ గాజువాకలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో మనోవేదనకు గురైంది. ఆమె తల్లిదండ్రులు పనికి, తమ్ముడు స్కూల్‌కు వెళ్లడంతో గురువారం మధ్యాహ్న సమయంలో తన గదిలోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్కూల్ నుంచి వచ్చిన తమ్ముడు గది తలుపు కొట్టినా.. తెరవకపోవడంతో కిటికీ నుంచి చూశాడు. ఫ్యాన్‌కు వేలాడుతున్న అఖిలను చూసి కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి తలుపు తెరిచి..అఖిల మృతదేహాన్ని కిందకు దించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు ఆత్మహత్య చేసుకోవడంతో.. తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా సీఐ లూథర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంచరపాలెంలో..

మర్రిపాలెం: కంచరపాలెం పల్నాటికాలనీ శ్రీనివాసనగర్ తల్లితో కలిసి నివాసం ఉంటున్న బోనెల జగదీష్(18) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ఫలితాల్లో ఓ సబ్జెక్టు పోయిందని మనస్తాపం చెంది గురువారం ఉదయం ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి బోనెల రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం ఏఎస్‌ఐ కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీలిమ భోగాదికి ఘన సత్కారం


నీలిమ భోగాదిని సత్కరిస్తున్న వర్సిటీ వీసీ సూర్యప్రకాష్ తదితరులు

సబ్బవరం: సాగా ఆఫ్ ఉమెన్ ఇన్ ఏటికొప్పాక వీడియో ప్రపంచ స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. వీడియో రూపకర్త అయిన డాక్టర్ నీలిమ భోగాదిని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్ అభినందించారు. యూనివర్సిటీ చరిత్రలోనే ఇది మరిచిపోని రోజని ఆనందం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా నీలిమ పనిచేయడం ఎంతో గర్వకారణమన్నారు. డాక్టర్ నీలిమ భోగాది సారథ్యంలో ఏటికొప్పాక వీడియో ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం -2023 పోటీలకు ఇటీవల ఎంపికైంది. సోషల్ మీడియా వేదికగా డబ్ల్యూపీవో ఓటింగ్‌కు ఆహ్వానించింది. ఏటికొప్పాక వీడియోకు ప్రపంచ వ్యాప్తంగా నెటిజన్లు ఓటు వేశారు. దీంతో ప్రపంచంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా నీలిమను వీసీ సూర్యప్రకాష్, సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించి, జ్ఞాపికగా వర్సిటీ ఫైలాన్‌ను అందజేశారు. అభినందన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.మధుసూదనరావు, సీనియర్ ఆచార్యులు ఎ. రాజేంద్రప్రసాద్‌తో బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నంలో వస్త్ర దుకాణం దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం యువరాణి వస్త్ర దుకాణంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు 11.15 గంటలకు ఈ సంఘటన జరగ్గా..భారీగా మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మర్రిపాలెం, ఎన్‌ఎస్‌టీఎల్ ఫైర్ అధికారులు చేరుకున్నారు. రాత్రి 12.30 గంటలు దాటినా ఇంకా మంటలు అదుపులోకి రాలేదు. మూడు అంతస్తుల్లో ఈ షాపు ఉండడం, దిగువ ఫ్లోర్‌లో మంటలు వ్యాపించడంతో లోపలికి వెళ్లే అవకాశం లేకపోయింది. ప్రమాదం ఎలా సంభవించిందో తెలియరాలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు వ్యాపించి ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ దుకాణానికి ఆనుకుని సౌందర్య షాపింగ్ మాల్, మొబైల్ ఫోన్ల దుకాణాలు ఉన్నాయి. వాటికి మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వాహనం ఢీకొని ఇద్దరి మృతి


చరణ్ కుమార్(ఫైల్)


సాయి సంపత్(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం/గోపాలపట్నం: నగరంలో స్నేహితులను కలుస్తామని చెప్పి ఇద్దరు విద్యార్థులు ఇంటి నుంచి బైక్‌పై వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి తిరిగి వస్తుండగా.. ఎయిర్‌పోర్టు జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఓ విద్యార్థి సంఘటన స్థలంలో, మరో విద్యార్థి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. నాతయ్యపాలేనికి చెందిన గోకాడ చరణ్ కుమార్ (16) బెహరా కళాశాలలో డిప్లమో ఎలక్ట్రానిక్స్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఐటీఐ అప్రెంటీస్ చేస్తున్న సాయి సంపత్(17)తో కలిసి బైక్‌పై బుధవారం రాత్రి నగరానికి బయలుదేరారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తిరిగి ఇంటికి వస్తున్నారు. 1.30 గంటల ప్రాంతంలో ఎయిర్ పోర్టు జంక్షన్ దాటిన తర్వాత వెనకనే వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చరణ్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సాయి సంపత్ తలకు తీవ్ర గాయంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఎయిర్ పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. చరణ్ తండ్రి గురుమూర్తి ప్రైవేట్ పనులు చేస్తుంటాడు. సోదరుడు ఉన్నాడు. సాయి సంపత్ తన కుటుంబ సభ్యులతో నాతయ్యపాలెంలో నివసిస్తున్నాడు.

పక్కా ప్రణాళికతో పరిశ్రమలు స్థాపించండి

పరిశ్రమల శాఖ జీఎం గణపతి


ఎక్స్‌పో ప్రారంభిస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ జీఎం గణపతి

అక్కిరెడ్డిపాలెం: ఔత్సాహికులకు ఎక్స్‌పోలు ఉపయుక్తంగా నిలుస్తాయని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్.గణపతి అన్నారు. ఆటోనగర్ డీ-బ్లాక్, సరిపల్లి గ్రాండ్, గోపాల్ ఇంజనీరింగ్‌లో ఇండస్ట్రియల్ కం బిజినెస్ ఎక్స్‌పో-2023 గురువారం ప్రారంభమైంది. ఫ్లవరిష్ క్రియేషన్ యజమాని డి.వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నియమ, నిబంధనల అనుసరించి.. పక్కా ప్రణాళికతో పరిశ్రమల స్థాపన చేపట్టాలన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు కొనసాగుతుందని వినోద్ తెలిపారు. ఫ్యాప్సియా ఉపాధ్యక్షుడు వై.సాంబశివరావు, వాసీవా ఉపాధ్యక్షుడు ఈ.కృష్ణ ప్రసాద్, ఎస్టేట్ ఇన్‌చార్జి చైర్మన్ జగపతిరాజు, ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ వికాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏసీబీ తనిఖీలు

సబ్ రిజిస్టర్ ఫోన్ పేకు రూ. 90 వేలు జమైనట్లు గుర్తింపు

దొండపర్తి: జగదాంబ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు ముగిశాయి. ఇందులో అధికారులు, సిబ్బంది అవినీతి పాత్ర మరోసారి వెలుగు చూసింది. ఏసీబీ స్పందన టోల్ ఫ్రీ నెంబర్‌కు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు బుధవారం నుంచి జగదాంబ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో దస్త్రాలను పరిశీలించారు. ఓ ప్రైవేట్ వ్యక్తి నుంచి సబ్ రిజిస్టర్ ఫోన్ పేకు రూ.90 వేలు జమైనట్లు అధికారులు గుర్తించారు. అలాగే 13 మంది డాక్యుమెంట్ రైటర్ల నుంచి రూ.39 వేలు నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

మహారాణిపేట: ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశంలో గురువారం జరిగిన రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 500 చదరపు గజాల లోపు ఆక్రమణలు ఉన్న నివాస యూనిట్లను క్రమబద్ధీకరణ చేస్తున్నామన్నారు. పట్టాలు, ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసి ఇచ్చిన ప్లాట్లకు క్రయ అనుమతులు కల్పించడానికి కృషి చేయాలన్నారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో భాస్కరరెడ్డి, స్టాంపులు శాఖ జిల్లా రిజిస్ట్రార్ మూర్తి, పలువురు డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శశి విద్యార్థుల సత్తా

తగరపువలస : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో సంగివలస శశి క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో బి.సాయిప్రణీత 988, కె.తేజభరత్ 987, ఇ.గౌతమ్, కె.వి.ఎస్.చైతన్య, పి.నాగసాయి నిఖిత, బి.చరణ్‌లు 986 చొప్పున మార్కులు సాధించారన్నారు. 980కు పైగా మార్కులు 37 మంది, 970కు పైగా మార్కులు 91, 950కు పైగా మార్కులు 62 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను వై.ప్రశాంతి, నాగసాయిరామ్, పి.పూజితరామ్, సిహెచ్ హరిసాత్విక, పి.వి.వర్ధన్ 465 మార్కుల చొప్పున సాధించారన్నారు. 460కు పైగా మార్కులు 85 మంది, 450కు పైగా 218 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను కేటీ షణ్ముఖ శ్రీ, బి.శ్రీవల్లి, వై.తేజశ్రీ 435 చొప్పున మార్కులు సాధించారన్నారు. 430కు పైగా మార్కులు 19 మంది, 400కు పైగా 81 మంది విద్యార్థులు సాధించి సత్తా చాటారన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

ఇంటర్ ఫలితాలలో శ్రీవిశ్వ జయభేరి

సీతంపేట: ఇంటర్ ఫలితాలలో శ్రీవిశ్వ కళాశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ ఫలితాలలో నెక్కల నవీన్ 465/470 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. ఉప్పలపాటి రోషిణి 464, జాగారపు శ్రావ్య 464, రెడ్డి యువరాజు 464,హెచ్.సుధీర్ 464, పి.చంద్రసాయి 464 మార్కులు, 34 మంది 460 మార్కులకు పైగా, 193 మంది 450 మార్కులకు పైగా సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సిహెచ్.వివేక్‌కుమార్ 986/1000 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. పూడి సంపత్ వినాయక్ 985, పిన్నింటి హర్షిత 985, సీర ఛార్మి 984, వి.దేవహర్షిణి 983, కె.జి.డి.కృష్ణ 983, పి.యశ్వంత్ 983 మార్కులు సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శ్రీవిశ్వ విద్యాసంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ అభినందించారు.

నేడు మంత్రి సురేష్ రాక

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం నగరానికి రానున్నారు. రాత్రి 10.40 గంటలకు విశాఖ చేరుకుని నోవాటెల్‌కు బస చేస్తారు. శనివారం ఉదయం 7.30గంటలకు రోడ్డుమార్గం గుండా శ్రీకాకుళం జిల్లాకు పయనమవుతారు. రాత్రి 6.55 గంటలకు విశాఖ చేరుకుని రైలులో తిరుగు ప్రయాణమవుతారు.

నేటి నుంచి డ్యాన్స్ ఫెస్టివల్

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే 2023 వేడుకలను విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో బీచ్‌రోడ్డులోగల అన్నమయ్య విగ్రహం వద్ద నిర్వహించనున్నామని నిర్వాహకులు కన్నం వెంకటరమణారావు తెలిపారు. తొలి రోజు సాయంత్రం 6.30 గంటలకు కళారాధన మ్యూజిక్ అండ్ అకాడమి వారిచే తాళ్లపాక సందీప్ కుమార్ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శనలు ఉంటాయన్నారు.

బాన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌లో భాగస్వాములు కండి

ఎంవీపీకాలనీ: ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బాన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.సుహాసిని ఆనంద్ కోరారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ 2014 నుంచి ప్రజలతో మమేకమవుతూ ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఆ రోజు ప్రతి నియోజకవర్గంలోను వంద చోట్ల ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

చోడవరం ఎంఈవో శ్రీనివాసరావు మృతి


నగిరెడ్ల శ్రీనివాసరావు

తగరపువలస: అనకాపల్లి జిల్లా చోడవరం ఎంఈవో నగిరెడ్ల శ్రీనివాసరావు (57) అస్వస్థత కారణంగా చికిత్స పొందుతూ నగరంలోని ఆస్పత్రిలో గురువారం సాయంత్రం చనిపోయారు. ఈయన స్వస్థలం జీవీఎంసీ భీమిలి జోన్ 3వ వార్డుకు చెందిన రాయపాలెం. ప్రస్తుతం భార్య, కుమారునితో కార్‌షెడ్ కూడలి సమీపంలో ఉంటున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధుల్లో చేరకముందు తగరపువలసలో వేలాది మందికి గణితంలో శిక్షణ ఇచ్చారు.

ఏపీ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్ రాక నేడు

మద్దిలపాలెం: ఢిల్లీలోని ఏపీ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్, ఏపీ చీఫ్ అడ్వైజర్ ఆదిత్యనాథ్ దాస్ శుక్రవారం నగరానికి రానున్నారు. న్యూఢిల్లీ నుంచి ఉదయం 6 గంటలకు అక్కడి విమానాశ్రయం నుంచి బయలుదేరి.. 8.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నోవాటెల్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవానికి హాజరవుతారు. సాయంత్రం 6.30 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి హైదరాబాద్ వెళ్తారు.

శవాలపై పేలాలు

- కేజీహెచ్‌లో ఇంటి దొంగలు
- చనిపోయిన మహిళ బంగారు చైన్ దొంగలించారు

డాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో ఇంటి దొంగలు రోజురోజుకూ ఎక్కువవుతున్నారు.రోగులు, రోగుల సహాయకులతో పాటు వైద్యుల బంగారు ఆభరణాలు దొంగలిస్తున్నారు. తాజాగా మరో అడుగు ముందుకేసి చనిపోయిన మహిళ మెడలో ఉన్న బంగారు చైన్‌ను చోరీ చేశారు. దీనిపై బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలసకు చెందిన సుశీల గురువారం మృతి చెందారు. ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరణ కోసం ఈసీజీ గదికి తీసుకెళ్లారు. మహిళ బంధువులను అక్కడి సిబ్బంది బయట ఉండమన్నారు. ఈసీజీ అనంతరం చనిపోయినట్టు సిబ్బంది ధ్రువీకరించారు. ఈ క్రమంలో సుశీల మెడలో ఉన్న బంగారు చైన్ చోరీకి గురైనట్టు ఆమె బంధువులు గుర్తించారు. వెంటనే సిబ్బందిని నిలదీశారు. సరైన సమాధానం రాకపోవడంతో వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసీజీ గది వద్ద ఉన్న సీసీ కెమెరా పనిచేయడం లేదని వారు చెబుతున్నారు కాగా. ఇటీవల గైనకాలజీ విభాగం ఆపరేషన్ థియేటర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబేదాకు చెందిన రెండు తులాల బంగారు గాజులు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: వైఎంసీఏ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు జరగనున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు గురువారం ప్రారంభమయ్యాయి. 18 అంశాల్లో ఐదు నుంచి పదిహేడేళ్ల బాలబాలికలు పాల్గొన్నారు. స్కేటింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, చెస్, టేబుల్‌టెన్నిస్, టెన్నిస్, కరాటే, జూడోలతో పాటు ఎయిరోబిక్స్, కాలిగ్రఫీ, అబాకస్, మ్యూజిక్, డాన్స్ తదితర అంశాల్లో శిబిరాల్లో శిక్షణనిస్తున్నారు. వైఎంసీఏతో పాటు ఏయూ గ్రౌండ్స్ వేదికగా ఆయా అంశాల్లో శిక్షణనిస్తున్నారు. ఉదయం 6 నుంచి కొన్ని అంశాల్లో శిక్షణనిస్తుండగా మ్యూజిక్, డాన్స్ తదితర అంశాల్లో సాయంత్రం వేళలో శిక్షణార్థులకు అనుకూలమైన వేళల్లో ప్రాక్టీస్‌కు అవకాశం కల్పించామని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అబాకస్‌లాంటివి ఇండోర్‌లోనే తర్ఫీదు ఇస్తున్నామన్నారు. సౌత్‌ఈస్ట్ ఇండియా వైఎంసీఏ చైర్మన్ రోలండ్ విలియమ్స్ పాల్గొని ప్రారంభించారు. ఈ శిబిరాలు మే31వ తేదీతో ముగియనున్నాయి.